# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు.
- పర్యాటక రంగానికి సంబంధించి గత 15 నెలల్లో 10 వేల 644 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.
- రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు.
- భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఆసియా కప్ టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది.

=========================

దసరా ఉత్సవాలకు విజయవాడ వచ్చిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడ కనకదుర్గమ్మ వారిని సతీ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. దుర్గమ్మను దర్శించుకున్న ఉపరాష్ట్రపతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని మీడియా పాయింట్ వద్ద ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

అంతకుముందు విజయవాడకు చేరుకున్న ఉపరాష్ట్రపతి దంపతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

=========================

రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈరోజు ఉదయం శాసనసభ ప్రశ్నోత్తరాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సమాధానమిస్తూ.. ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆక్వా రంగాన్ని జోన్, నాన్ జోన్ గా విభజించి అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. ఆక్వా పంటలకు జియో ట్యాగ్ చేసి చెరువులను గుర్తిస్తున్నామన్నారు. ఆక్వా రైతులు తప్ప నిసరిగా రిజిస్ట్రర్ అవ్వాలని, రిజిష్టర్ అయిన రైతులకు మాత్రమే విద్యుత్ యూనిట్ కు రూపాయి 50 పైసలు రాయితీ వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అదే విధంగా చేపల పెంపకపు అభివృద్ధి ప్రాధికార సంస్థ సవరణ బిల్-2025 కు ఈరోజు శాసనసభ ఆమోదం తెలపడం పట్ల సభ్యులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

========================

రాష్ట్రంలోని 100 పుణ్యక్షేత్రాల్లో టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన శాసన మండలిలో మాట్లాడుతూ… పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గత 15 నెలల కాలంలో 10 వేల 644 కోట్ల రూపాయలు పర్యాటక పెట్టుబడులు, 103 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. 2024-2029 కాలానికి నూతన పర్యాటక పాలసీని తీసుకువచ్చామని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

========================

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యులు పి. విష్ణు కుమార్ రాజు శాసనసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ… అమరావతిలో సీఆర్డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నాయని చెప్పారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 2026 మార్చి 31 నాటికి 3 వేల 500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి అవుతుందని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

========================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా అసంఘటిత రంగం బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం…

(వాయిస్ 90 సెకన్లు)

========================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలపై విజయవాడలోని స్థానిక హోటల్లో ఈరోజు జీఎస్టీ అవగాహన సదస్సుని నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్, అతిథులుగా జీఎస్టీ జాయింట్ కమీషనర్లు ప్రశాంత్, కల్పన, రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్లూరి భాస్కర రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రయోజనాలు ఏమిటి, ఆ ప్రయోజనాలు ఏవిధంగా ప్రజలకు బదలాయింపు జరగాలి, వినియోగదారుల కొనుగలు శక్తి ఎలా పెరుగుతుందనే విషయాలపై చర్చించారు.

========================

ప్రజా ఆరోగ్య సంరక్షణకు కీలకమైన పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. స్వచ్ఛతా హి సేవ పేరిట పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సామూహిక పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగా ఈరోజు ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రమేష్ బాబు, బ్యాంక్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

==========================

ఆసియా కప్ సూపర్ ఫోర్‌లో భాగంగా ఈరోజు భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. సూపర్ 4లో ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు విజయం సాధించడంతో ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టు దాదాపు ఫైనల్స్‌కు చేరుకుంటుంది.

==========================
==========================